క్లుప్తంగా

మోదకొండమ్మ ఆలయానికి భక్తుల తాకిడి

మాడుగుల : ఉత్తరాంధ్ర ఇలవేలుల్పు మాడుగుల మోదకొండమ్మ ఆలయానికి ఆదివారం భక్తుల తాకిడి పెరిగింది. శ్రావణ ఆదివారం సందర్భంగా మోదకొండమ్మను నగలు, పూలు, ఆకర్షణీయమైన వస్త్రాలతో అలంకరించారు. శ్రావణ ఆదివారం సందర్భంగా అధిక సంఖ్యలో మహిళా భక్తులు అమ్మవారిని దర్శించుకుని కుంకుమ పూజల్లో పాల్గొన్నారు. ఆలయ కమిటీ భక్తులకు, ఉచితంగా తాగు నీరు, ప్రసాదం అందజేశారు.

నూకాంబిక ఆలయ పునర్నిర్మాణ పనులకు శ్రీకారం


గర్భ గుడి ప్రదేశం నుంచి అమ్మవారిని మరో ప్రాంతానికి తరలిస్తున్న భక్తులు

రోలుగుంట : మండల కేంద్రం రోలుగుంటలో నూకాంబిక ఆలయం పునర్నిర్మాణ పనులను కమిటీ చేపట్టింది. ఈ ఆలయం శిథిలావస్థకు చేరుకోవడంతో స్థానిక భక్తులు కమిటీగా ఏర్పడి ఆలయాన్ని పునర్నిర్మాణానికి సంకల్పించారు. గత వారం ఆలయ గోడలు తొలగించారు. గర్భగుడి నుంచి అమ్మవారిని సమీపంలోకి భక్త కమిటీ తరలించింది. దాతల సాయం స్వీకరిస్తున్నామని, నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయని నిర్వాహకులైన మనసబ్ కుటుంబీకులతో పాటు ఆలయ నిర్మాణ కమిటీ బోయపాడు శ్రీను, రమక్క, దేవుడు ,అల్లు శ్రీను తదితరులు పేర్కొన్నారు. ఆలయ నిర్మాణానికి దాతలు సహకరించాలని కోరారు.

సీతమ్మకు మంగళ సూత్రాల బహూకరణ


అర్చకులకు బంగారు మంగళ సూత్రాలు అందజేస్తున్న ఎంపీటీసీ శ్రీనివాసరావు తదితరులు

మాడుగుల రూరల్ : కె.జె.పురం సీతారామ స్వామి ఆలయంలో సీతమ్మతల్లికి బంగారు మంగళ సూత్రాలను ఆదివారం బహూకరించారు. గ్రామానికి చెందిన పాలకుర్తి వెంకటరమణ, బేబీ కుమారుడు అయిన మోహన్ రావు ఆర్థిక సహకారంతో ఆయన భార్య కుసుమ జ్ఞాపకార్థం బంగారు మంగళ సూత్రాలను ఆలయ ప్రధాన అర్చకులు వెంకటరమణకు ఎంపీటీసీ సభ్యుడు భీశెట్టి శ్రీనివాసరావు చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో సంతోషిమాత ఆలయ కమిటీ చైర్మన్ కాళ్ల అమ్మతల్లినాయుడు పాల్గొన్నారు.

కొత్త ఓటర్లు నమోదు చేసుకోండి

మాడుగుల రూరల్ : ఎన్నికల సంఘం ఆదేశాలతో కొత్త ఓటర్లు నమోదు చేసుకోవాలని స్థానిక తహసీల్దారు పి.వి.రత్నం ఆదివారం విడుదల చేసిన ప్రకటనలో కోరారు. 1-1-2025 నాటికి 18 సంవత్సరాలు వయస్సు నిండిన వారు అంతా ఓటర్లుగా నమోదు కావాలన్నారు. గ్రామాల్లో బీయల్వోలు ఇంటింటికి తిరిగి నూతన ఓటర్లను నమోదు చేసుకుంటారని, అలాగే ఓటర్ల చేర్పులు, మార్పులు, సవరణలు, చేసుకోవచ్చునని ఎన్నికలు సంఘం ఆదేశాలు మేరకు వచ్చే నెల 21 వ తేదీ వరకు ఈ పక్రియ జరుగుతుందని తహసీల్దార్ తెలిపారు.

మాజీ వైస్ ఎంపీపీ కుటుంబానికి పరామర్శ


శ్రీనివాసరావు కుటుంబీకులతో మాట్లాడుతున్న సూర్యనారాయణరాజు తదితరులు

మాకవరపాలెం: అనారోగ్యంతో మృతి చెందిన మాజీ వైస్ ఎంపీపీ కుటుంబ సభ్యులను మాజీ ఎమ్మెల్సీ డి.వి.సూర్యనారాయణ పరామర్శించారు. ఈ నెల 13న మాజీ వైస్ ఎంపీపీ చింతకాయల శ్రీనివాసరావు అనారోగ్యం కారణంగా మరణించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆదివారం సాయంత్రం శ్రీనివాసరావు కుటుంబ సభ్యులను సూర్యనారాయణరాజు పరామర్శించి తన ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. మృతికి గల కారణాలను తెలుసుకున్నారు. ఆయన వెంట మండల వినియోగదారుల సంఘ అధ్యక్షుడు బోళెం వరహాలదొర, డీలర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు అడిగర్ల సన్యాసయ్య, వైఎస్సార్‌సీపీ నేతలు మూకల బాలకృష్ణ, చంటిరాజు ఉన్నారు.

వాచ్‌మన్ లేక భయం భయం



మా పీహెచ్‌సీకి నైట్ వాచ్‌మెన్ లేకపోవడంతో రాత్రి సమయాల్లో విధులు నిర్వహించాలంటే భయం వేస్తోంది. రాత్రి వేళల్లో వైద్య సేవలు పొందేందుకు వచ్చేవారికి తోడుగా మద్యం సేవించి వస్తున్నారు. ఒక్కో సమయంలో మద్యం మత్తులో మాతో గొడవకు దిగుతుండడంతో విధులు నిర్వహించేందుకు భయపడుతున్నాం. వెంటనే వాచ్‌మన్‌ను నియమించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలి.

మణి, స్టాఫ్ నర్స్, మాకవరపాలెం పీహెచ్‌సీ



కఠిన శిక్షలతోనే అఘాయిత్యాలకు అడ్డు



కోల్‌కతా వైద్యురాలిపై అఘాయిత్యానికి పాల్పడిన దోషులకు నెలరోజుల్లో శిక్ష పడినట్లయితే దేశంలో మరెక్కడా అటువంటి ఘటనలు జరగవు. రోగుల ప్రాణాలను నిలిపే వైద్యులతో పాటు వైద్య సిబ్బందిపై దేశంలో నిత్యం ఎక్కడో ఒక చోట దాడులు జరుగుతూనే ఉన్నాయి. ప్రాణం పోసే వైద్యులపై ఇటువంటి ఘటనలకు దిగితే వైద్యం ఎలా అందించాలి. ప్రభుత్వం పని చేసే చోట పోలీసు రక్షణ కల్పించాలి. రాత్రి విధులకు హాజరయ్యే వైద్యులు, వైద్య సిబ్బంది వాహన సదుపాయం కల్పించాలి.

– స్వప్న సావిత్రమ్మ, ఏఎస్ఎం, 7వ సచివాలయం, వేల్పులవీధి

పేరుకే జలాశయం...


నీరు లేకుండా దర్శనమిస్తున్న మామిడిపాలెం రిజర్వాయర్


మట్టితో కప్పిఉన్న పార్లుకట్టు

ఏటా రెండు పంటలకు సాగునీరు అందించాల్సిన రిజర్వాయర్ వృథాగా పడి ఉంది. ఫలితంగా వెయ్యి ఎకరాలకు సాగునీరు ప్రశ్నార్థకంగా మారింది. దాదాపు 15 ఏళ్లకుపైగా ఈ రిజర్వాయర్ ఇలాగే ఉన్నా పట్టించుకునేవారు లేరు. దీంతో ఏటా వరి సాగుకు ఆ రైతులు దూరమవుతున్నారు.

- జాజిగెడ్డ రిజర్వాయర్ దుస్థితి
- పేరుకుపోయిన పూడిక
- వర్షాలున్నా నిల్వ ఉండని నీరు
- 15 ఏళ్లుగా ఆయకట్టుకు అందని సాగునీరు
- వరి సాగుకు దూరమైన రైతులు

మాకవరపాలెం : మండలంలోని మామిడిపాలెంలో జాజిగెడ్డ రిజర్వాయర్ ఉంది. దీనిని 1975 ఏడాదిలో నిర్మించారు. సుమారు 150 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ఈ రిజర్వాయర్ ద్వారా అడిగర్లపాలెం, అప్పన్నదొరపాలెం, రామారాయుడుపాలెం, కె.తూటిపాల, మామిడిపాలెం ప్రాంతాల్లో ఉన్న 1000 ఎకరాలకు సాగునీరు అందించాల్సి ఉంది. కానీ నిర్మించిన అనంతరం కొంతకాలం సక్రమంగానే ఆయకట్టు భూములకు సాగునీరు అందింది. కాలక్రమేణ కొండ గెడ్డల నుంచి వచ్చే నీటితో పాటు మట్టి కొట్టుకురావంతో రిజర్వాయర్ పూడకుపోయింది.

12 అడుగుల మేర పేరుకున్న పూడిక..

ఈ రిజర్వాయర్ గర్భంలో సుమారు 12 అడుగుల మేర పూడిక పేరుకుపోయింది. దీంతో ఎంత పెద్ద వర్షాలు కురిసినా రిజర్వాయర్ గర్భంలో ఒక్క చుక్కనీరు కూడా నిల్వ ఉండడం లేదు. ఈ నేపథ్యంలో పై గ్రామాల పరిధిలో ఉన్న వెయ్యి ఎకరాలకు సాగునీరు అందకుండా పోయింది. దీంతో చేసేది లేక రైతులు దీర్ఘకాలిక పంటలైన సరుగుడు, జీడి, మామిడి సాగుపైనే దృష్టి సారిస్తున్నారు. వరి పంటకు పూర్తిగా దూరం కావాల్సిన పరిస్థితి ఏర్పడిందని రైతులు ఆవేదన చెందుతున్నారు.

ఏళ్లుగా నిర్లక్ష్యం...

గత 15 ఏళ్లుగా ఈ రిజర్వాయర్ వృధాగా పడి ఉన్నా అధికారులు, మారుతున్న ప్రభుత్వాలు పట్టించుకోలేదని రైతులు ఆరోపిస్తున్నారు. గత టీడీపీ హయాంలో నీరు–చెట్టులో పూడిక తొలగింపునకు సుమారు రూ.40 లక్షలు మంజూరు చేసినా అరకొరగానే పనులు చేసి వదిలేశారని రైతులు చెబుతున్నారు. తీసిన పూడిక మట్టిని రిజర్వాయర్ పొర్లు కట్టుపైనే వేసి వదిలేశారని ఆవేదన చెందుతున్నారు. ఈ పరిస్థితుల్లో చుట్టుపక్కల రైతులు రిజర్వాయర్ గర్భాన్ని ఆక్రమించుకుపోతున్నారని రైతులు తెలిపారు. కొత్త ప్రభుత్వమైనా ఈ రిజర్వాయర్ ఆక్రమణలు తొలగించి, వినియోగంలోకి తీసుకువచ్చేందుకు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

ఇబ్బందులు గుర్తించండి



15 ఏళ్లుగా రైతులు పడుతున్న ఇబ్బందులను ప్రభుత్వం, అధికారులు గుర్తించాలి. రిజర్వాయర్‌ను వినియోగంలోకి తీసుకువచ్చేందుకు చర్యలు తీసుకోవాలి. ఈ రిజర్వాయర్ నుంచి నీరు అందకపోవడంతో ఏటా పంటల సాగుకు ఇబ్బందులు పడుతున్నాం.

– అడిగర్ల నూకరాజు, రైతు, అడిగర్లపాలెం

వరికి దూరం..



ఈ రిజర్వాయర్ నుంచి సాగునీరు అందకపోవడంతో వరి పంటకు దూరమయ్యాం. ఏటా రెండుసార్లు వరి పండే మా భూముల్లో దీర్ఘకాలిక పంటలను సాగుచేయాల్సివస్తోంది. ఈ ప్రభుత్వమైనా రిజర్వాయర్‌లోని పూడిక తొలగించే పనులు చేయించాలి.

– కచ్చళ్ల శివ, రైతు, మామిడిపాలెం

ఆకట్టుకున్న రంగవల్లుల పోటీలు


దేవరాపల్లి శ్రీకృష్ణాలయ ప్రాంగణంలో ముగ్గుల పోటీలను తిలకిస్తున్న స్థానికులు


విజేతలకు బహుమతులను అందజేస్తున్న స్థానిక నాయకులు

దేవరాపల్లి : దేవరాపల్లిలో కృష్ణాష్టమి వేడుకల్లో భాగంగా ఆదివారం నిర్వహించిన రంగవల్లి పోటీలు విశేషంగా ఆకట్టుకున్నాయి. స్థానిక యాదవ యూత్ సంఘం, పెద్దల ఆధ్వర్యంలో నిర్వహించిన ముగ్గుల పోటీలలో 30 మంది మహిళలు, బాలికలు పాల్గొన్నారు. శ్రీకృష్ణ ఆలయ ప్రాంగణంలో అద్భుతంగా వేసిన రంగు రంగుల ముగ్గులను స్థానిక ప్రజలు తరలివచ్చి ఆసక్తిగా తిలకించారు. విజేతలకు బహుమతులుగా కూలర్, ఫ్యాన్, గ్యాస్ స్టౌ, హాట్ బాక్స్‌లను మాజీ ఎంపీపీ కిలపర్తి భాస్కరరావు, స్థానిక ఎంపీటీసీ మొల్లి కృష్ణమూర్తి, బంధం అప్పలరాజు, వారాది దేముళ్లు, గొర్లె సన్యాసినాయుడు, నమ్మి దేముళ్ల తదితరులు, స్థానిక యూత్ సభ్యులు చేతుల మీదుగా అందజేశారు. పోటీలకు న్యాయ నిర్ణేతలుగా దేవరాపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల సోషల్ టీచర్ సత్యనారాయణ, డ్రాయింగ్ టీచర్ సాగర్‌కుమార్ వ్యవహరించారు. కృష్ణాష్టమి సందర్భంగా సోమవారం ప్రత్యేక పూజా కార్యక్రమాలతో పాటు మధ్యాహ్నం భారీ అన్నసమారాధన, సాయంత్ర ఉట్టి కొట్టే మహోత్సవం, స్వామివారి ఊరేగింపు జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు.

స్నేహితుడికి ఆత్మీయ విద్యార్థిసేన సాయం


స్నేహితుడు వేంకటేశ్వరరావుకి ఆర్థిక సాయం అందిస్తున్న ఆత్మీయ విద్యార్థిసేన ప్రతినిధులు

చోడవరం : ఒకే స్కూల్లో చదువుకున్న సహచర స్నేహితుడికి పూర్వపు విద్యార్థులంతా చేయూతనందించారు. మామిడిపాలెం హైస్కూల్లో చదువుకున్న విద్యార్థులంతా ఆత్మీయ విద్యార్థి సేన ఏర్పాటు చేసుకొని ఈ పాఠశాలలో చదువుకున్న విద్యార్థుల్లో ఎవరికి ఏ కష్టం వచ్చినా మేమున్నామంటూ ఈ ఆత్మీయ విద్యార్థి సేన తరఫున సహాయం అందిన్నారు.

దీనిలో భాగంగా చోడవరం మండలం గంధవరం గ్రామానికి చెందిన ఇదే స్కూల్‌లో చదువుకున్న పల్లా వెంకటేశ్వరరావు ఇటీవల రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఇంటి వద్దే ఉన్నారు. తమ స్కూల్లో చదువుకొని రోడ్డు ప్రమాదానికి గురై ఇబ్బందిలో ఉన్న తమ స్నేహితుడికి సహాయం అందించేందుకు ఆత్మీయ విద్యార్థిసేన ముందుకు వచ్చింది. రూ. 40వేలు నగదును విద్యార్థి సేన తరఫున తమ స్నేహితుడికి సాయంగా అందించి మానవత్వాన్ని చాటుకున్నారు. వారికి వెంకటేశ్వరరావు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యార్థిసేన అధ్యక్షుడు పల్లా రాజు, ఉపాధ్యక్షుడు తోటాడ సింహాచలం, కార్యదర్శి గొల్లవిల్లి శ్రీనువాస్, కోశాధికారి వునుకూరి కృష్ణ, సభ్యులు ముత్తురెడ్డి రమేష్, ఒ.వి.ఎస్ కుమార్, కాకర అప్పలరాజు, తోసంగి రవి పాల్గొన్నారు.

పంచాయతీ కార్మికుల ఆందోళన


సీఐటీయూ ఆధ్వర్యంలో ఆందోళన చేస్తున్న పంచాయతీ కార్మికులు

రోలుగుంట: తమ న్యాయ సమ్మతమైన సమస్యల పరిష్కారం కోసం పంచాయతీ కార్మికులు ఆదివారం సీఐటీయూ ఆధ్వర్యంలో సమావేశం, ఆందోళన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం వీరి సమస్యలపై సీఐటీయూ మండలశాఖ అధ్యక్షుడు ఈరెల్లి చిరంజీవి మాట్లాడారు. గ్రామాలను పరిశుభ్రం చేస్తూ తద్వారా ఆరోగ్య గ్రామాలుగా తయారు చేయడానికి పారిశుధ్య కార్మికుల సేవలే కీలకం అన్నారు. వీరి సేవలను గమనంలోకి తీసుకొని కనీస వేతనాల జీవో అమలు చేయాలన్నారు. అలాగే వారికి గ్లౌజులు, నూనె, సబ్బులు, యూనిఫాం, ఐడీ కార్డులివ్వాలన్నారు. బీమా సౌకర్యం కల్పించి ఆదుకోవాలని, జీతాలు పెండింగ్ లేకుండా ప్రతి నెలా జీతాలు చెల్లించాలని డిమాండు చేశారు. వీటిని పరిష్కరించకుంటే వీరి ఆందోళన ఉధృతం చేయాల్సి ఉంటుందన్నారు.

క్యాన్సర్ రోగికి ‘స్నేహాంజలి’ బాసట


క్యాన్సర్ బారిన పడ్డ అచ్చియ్యమ్మకు నగదును అందజేస్తున్న సంస్థ సభ్యురాలు సంతోషి నళిని

దేవరాపల్లి : క్యాన్సర్ బారిన పడి తీవ్ర అనారోగ్యం, ఆర్థికపరమైన ఇబ్బందులతో సతమతమవుతున్న వృద్ధురాలికి స్నేహాంజలి ఫర్ పూర్ ఆర్గనైజేషన్ బాసటగా నిలిచింది. చీడికాడ మండలం అర్జునగిరి చెందిన నిరుపేద వృద్ధురాలైన సాలాపు అచ్చియ్యమ్మ క్యాన్సర్ బారిన పడి వైద్య ఖర్చులకు సైతం ఇబ్బందులు పడుతోంది. దేవరాపల్లిలో బంధువుల ఇంటి వద్ద ఉంటున్న నిరుపేద వృద్ధురాలికి రూ.12వేలు నగదును ఆదివారం స్నేహాంజలి ఫర్ పూర్ ఆర్గనైజేషన్ సభ్యులు అందజేసి మానవత్వం చాటుకున్నారు. ఈ నగదును అందించిన వారిలో స్నేహాంజలి ఫర్ పూర్ ఆర్గనైజేషన్ సభ్యురాలు, స్థానిక ఇంచార్జ్ ఈవోపీఆర్డి జి. సంతోషి నళిని, ఆర్గనైజేషన్ వలంటీర్లు సన్యాసినాయుడు, వాసు ఉన్నారు. ఈ ఆర్గనైజేషన్ ద్వారా ఇప్పటి వరకు 202 సేవా సహాయ కార్యక్రమాలు చేపట్టినట్టు సభ్యురాలు సంతోషి నళిని తెలిపారు.

బీహార్ మాజీ సీఎం మండల్‌కు ఘన నివాళి


బీహార్ మాజీ సీఎం ప్రసాద్ మండల్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

అనకాపల్లి : స్థానిక రింగ్ రోడ్డు ఏపీ సీమాంధ్ర బీసీ సంక్షేమ సంఘం కార్యాలయంలో బీహార్ మాజీ ముఖ్యమంత్రి బాబు బిందేశ్వరి ప్రసాద్ మండల్ 106వ జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర యువజన విభాగం సహాయ కార్యదర్శి ఆళ్ల ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ ప్రసాద్ మండల్ బీహార్ ఏడో ముఖ్యమంత్రిగా పని చేశారన్నారు. 30 రోజుల తర్వాత పదవికి రాజీనామా చేశారన్నారు. మండల కమీషన్‌గా ప్రసిద్ధి చెందిన రెండవ వెనుకబడిన తరగతుల కమీషన్‌కు చైర్మన్‌గా ఆయన విధులు నిర్వహించారని అన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం మాజీ ప్రధాన కార్యదర్శి బొట్టా చిన్నియాదవ్, రాష్ట్ర కార్యదర్శి బద్దం పైడిరాజు, సంఘం జిల్లా అధ్యక్షుడు చిన్నమూర్తి, సభ్యులు పల్లా గోవింద్, చందాన కృష్ణారావు, నరిసే చిరంజీవి, కడమంచిలి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రహదారిపై గోతులు పూడ్చాలి


వర్షపు నీటితో నిండిన నాయుళ్ల వీధి రహదారి

అనకాపల్లి : పట్టణంలోని రహదారులు పెద్దపెద్ద గోతులతో ప్రయాణించాలంటే భీతిగొలిపేలా ఉన్నాయి. వర్షాలు కురిస్తే ఎక్కడ గొయ్యి ఉందో తెలియని పరిస్థితి. జిల్లా ప్రధాన కేంద్రంలో రహదారులు ఇలా ఉంటే కూటమి నేతలు కనీసం కన్నెత్తి కూడా చూడడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సుంకరమెట్ట జంక్షన్, జలగల మదుం పెట్రోల్ బంకు వద్ద రహదారులు శిథిలం అయ్యాయి. ఈ రహదారిలో ప్రయాణించి పలువురు క్షతగాత్రులయ్యారు. విజయరామరాజుపేట రైల్వే అండర్ బ్రిడ్జి, నాయుళ్లవీధి, రింగ్‌రోడ్డు మీదుగా వెళ్లే రహదారి గోతులతో నిండిపోయాయి. తాగునీటి పైపు లైన్ల కోసం తీసిన గోతులను పూడ్చకపోవడంతో వర్షం పడితే గోతుల్లోకి వర్షపు నీరు చేరుతుంది. పెరుగుబజార్ జంక్షన్ నుంచి గాంధీ బొమ్మ జంక్షన్ వరకూ రహదారి విస్తరణ పనులు జరిగాయి. ఇక్కడ వర్షపు నీరు డ్రైనేజీలోకి వెళ్లే మార్గంలేక నీరు నిల్వ ఉండిపోయింది. వెంటనే రహదారులు బాగు చేయాలని పలువురు కోరుతున్నారు.

చిన్ని కృష్ణుని రాక కోసం...

- నేడు జన్మాష్టమి
- ముస్తాబైన ఆలయాలు


గుల్లేపల్లిలో కృష్ణాలయం


మాకవరపాలెంలో ముస్తాబైన ఆలయం

రోలుగుంట : శ్రీకృష్ణాష్టమి పురస్కరించుకొని మండలంలో గల కృష్ణ మందిరాలు వేడుకకు సిద్ధమవుతున్నాయి. కొండపాలెం, వడ్డిప గ్రామంలో గల కృష్ణమందిరాలను స్థానిక యాదవ సంఘాలు ఆలయాలను రంగులు వేయించి, రంగురంగుల బల్బులతో సుందరంగా తీర్చుదిద్దుతున్నారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీలు సోమవారం జరుగుతున్న ఈ వేడుకలో భక్తులు అధిక సంఖ్యలో వచ్చి తమ ఇష్టదైవమైన స్వామివారిని దర్శించుకోవాలని కోరారు. ఆ రోజు సాయం సంధ్య సమయంలో ఉట్లు పండగ నిర్వహిస్తామని, ఉత్సాహంగల యువకులు పాల్గొనాలని వారు కోరారు.

మాకవరపాలెం: కృష్ణాష్టమి వేడుకలకు ఆలయాలు ముస్తాబయ్యాయి. మండలంలోని మాకవరపాలెం, రాచపల్లి, గిడుతూరు, అడిగర్లపాలెంతోపాటు తదితర గ్రామాల్లో ఉన్న శ్రీకృష్ణుడి ఆలయాల్లో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించేందుకు ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు పూర్తి చేశారు. మండల కేంద్రంలోని బీసీ కాలనీలో ఉన్న కృష్ణుడి ఆలయం వద్ద మధ్యాహ్నం అన్నసమారాధన ఏర్పాటు చేసినట్టు కమిటీ సభ్యులు తెలిపారు. భక్తులు శ్రీకృష్ణుని దర్శించుకుని ప్రసాదం స్వీకరించాలని కోరారు.

మాడుగుల రూరల్ : జన్మాష్టమి పర్వదినం సందర్భంగా శ్రీకృష్ణ ఆలయాల్లో సోమవారం ప్రత్యేక పూజలు, అభిషేకాలు, స్వామి వారి తిరువీధి నిర్వహించనున్నారు. కేజేపురం రామాలయంలో గల ఉప ఆలయంలో శ్రీకృష్ణుడి తిరువీధి ఉత్సవం, పూజలు, రాత్రికి భజన కార్యక్రమం ఏర్పాటు చేస్తున్నారు. ఎం.కోడూరు శ్రీకృష్ణ ఆలయం, జి.అగ్రహారంలో జన్మాష్టమి వేడుకలు నిర్వహిస్తారు. సాగరం కాలనీలో మధ్యాహ్నం అన్నసమారాధన నిర్వహిస్తారు. చీడికాడ మండలం చుక్కపల్లిలో వేణుగోపాలస్వామి ఆలయంలో పూజలు, అన్న సమారాధనతో పాటు జిల్లా స్థాయి ఎడ్ల పరుగు పోటీలు నిర్వహిస్తారు. అలాగే సైకిల్ స్పీడ్, పిడతల పోటీలు, తప్పెటగుళ్ల పోటీలు నిర్వహిస్తామని, ఆయా కార్యక్రమాలకు స్థానిక ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి హాజరవుతారని నిర్వాహకులు తెలిపారు.

కె.కోటపాడు : కె.కోటపాడులో యాదవ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శ్రీ కృష్ణ జన్మాష్టమి నవరాత్రి మహోత్సవాలను ఈ నెల 26 నుంచి సెప్టెంబర్ 4 వరకూ జరపనున్నారు. గొల్లలపాలెం, గరుగుబిల్లి, పింద్రంగి, గొండుపాలెం, గుల్లేపల్లి గ్రామాల్లో గల శ్రీకృష్ణాలయాల్లో సోమవారం ప్రత్యేక పూజలు, మధ్యాహ్నం అన్న సమారాధన, ఉట్టికొట్టే కార్యక్రమం ఉంటుందని నిర్వాహకులు తెలిపారు.

నూకాంబిక అమ్మవారికి ప్రత్యేక పూజలు


తులసిమాల అలంకరణలో నూకాంబిక అమ్మవారు

అనకాపల్లి : గవరపాలెం నూకాంబిక అమ్మవారిని శ్రావణమాసం మూడో ఆదివారం సందర్భంగా తులసిమాలతో ప్రత్యేకంగా అలంకరించారు. విశాఖ ఉమ్మడి జిల్లాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్ని అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయానికి వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఈవో బండారు ప్రసాద్ ఉచిత ప్రసాద వితరణ నిర్వహించారు.

తక్షణమే శానిటేషన్ కార్మికుల జీతాలు చెల్లించాలి


మాట్లాడుతున్న సీఐటీయూ మహిళా విభాగం కార్యదర్శి జానకి

అనకాపల్లి : ప్రభుత్వ పాఠశాలల్లో శానిటేషన్ కార్మికుల సమస్యలపై సర్కారు తక్షణమే స్పందించాలని, ఈ ఏడాది మార్చి నుంచి బకాయి పడిన జీతాలు చెల్లించాలని స్కూల్ శానిటేషన్ జిల్లా (సీఐటీయూ) మహిళా విభాగం కార్యదర్శి జానకి అన్నారు. స్థానిక సీఐటీయూ కార్యాలయంలో ఆదివారం జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. రకరకాల యాప్‌లు తీసుకొచ్చి మానసిక ఆవేదనకు గురి చేస్తున్నారని, బడుగు బలహీన వర్గాలకు చెందిన తమను రాజకీయంగా తొలగించేందుకు కూటమి నేతలు ప్రయత్నాలు చేస్తున్నట్లు చెప్పారు.

సీఐటీయూ జిల్లా కార్యదర్శి గూనూరు వరలక్ష్మి మాట్లాడుతూ హైస్కూళ్లలో పని చేస్తున్న శానిటేషన్ కార్మికులు అధిక పని ఒత్తిడికి గురి అవుతున్నారని, వెయ్యి మంది వరకు ఉన్న పాఠశాలలు చాలా ఉన్నాయన్నారు. అలాంటి స్కూళ్లలో ఇద్దరు లేక ముగ్గురు పని వారిని నియమించి పని మొత్తం చేయాలని ఒత్తిడి చేస్తున్నట్లు తెలిపారు. ఏదైనా కష్టం వచ్చినప్పుడు కనీసం సెలవు కూడా ఇవ్వటం లేదని, పేద మహిళలు, ఒంటరి మహిళలు ఈ పథకంలో పని చేస్తున్నారని తెలిపారు. అలాంటిది నెలల తరబడి వేతనాలు ఇవ్వకపోతే ఏం తిని బ్రతకాలని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే ప్రభుత్వం స్పందించి వేతనాలు విడుదల చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు మణి, జానకి, నీలవేణి, వరలక్ష్మి, రాణి తదితరులు పాల్గొన్నారు.

కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్‌కు సన్మానం


బి.జె.వి.ప్రసాద్‌ను సన్మానిస్తున్న పట్టణ వాసులు

పాయకరావుపేట: గొలుగొండలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్‌గా పని చేస్తున్న బి.జె.వి.ప్రసాద్‌ను పట్టణంలో ఆదివారం స్థానికులు ఘనంగా సన్మానించారు. ప్రసాద్ జిల్లాలో ఉత్తమ కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్‌గా ఈ నెల 15న ఎంపీ సి.ఎం.రమేష్, హోంమంత్రి వంగలపూడి అనిత చేతుల మీదుగా ప్రశంసా పత్రం అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయనను సన్మానించి అభినందించారు. ఈ కార్యక్రమంలో రాయి రమేష్, డి.సామ్‌సన్, బి.రమణ, ఎ.జోషీపాల్, దడాల నెహూ, గొల్లాబత్తుల ఆనంద్ పాల్గొన్నారు.